బడ్జెట్‌లో పీఆర్సీ ఊసెత్తని సర్కారు

- ప్రస్తావనకు రాని 4 డీఏల పెంపు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): బడ్జెట్‌లో కేటాయింపులపై ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెదవి విరుస్తున్నారు. ఉద్యోగులకు అనుకూలంగా ఈ బడ్జెట్ లేదని అంటున్నారు. పీఆర్సీ గురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదని పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏల పెంపు ప్రస్తావన కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల రిటైర్‌మెంట్ సెటిల్‌మెంట్లు, పీఆర్సీకి నిధులు మంజురు చేసిన దాఖలాలు కనిపించడం లేదని తెలిసింది.

ఆటో కార్మికులకు మొండిచెయ్యి

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు మొండి చేయిచ్చింది. ఏటా ఆర్థికసాయం అందజేస్తానన్న ప్రభుత్వం.. దానికోసం బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. దీంతో ప్రభుత్వం మరోసారి తమను నమ్మించి మోసం చేసిందని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని, ఆటో కార్మికులను ఆదుకోవడానికి ఓలా, ఉబెర్ తరహాలో యాప్‌ను తీసుకొస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏప్రిల్ నుంచి వీటిని అమలు చేస్తామనే ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ ప్రకటించారు. వాటికోసం కేటాయింపులు చేయకపోవడంతో ఆటో కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

సాగునీటికి భారీగా నిధుల కోత

- నిరుడు 26,885 కోట్లు.. ప్రస్తుతం 22,301 కోట్లు
- గతంతో పోల్చితే 4,584 కోట్లు తగ్గింపు
- ఓటాన్ అకౌంట్‌తో పోల్చితే 5,723 కోట్లు కోత
- మిషన్ కాకతీయకూ తగ్గింపు
- ప్రాజెక్టుల నిర్వహణ, మెయింటనెన్స్‌కు సున్నా
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులకు అంతంతే..
- మీడియం ప్రాజెక్టుల్లో కొన్నింటికే పెంపు

హైదరాబాద్, జూలై25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రగతిలో అత్యంత ప్రాధాన్యం కలిగిన సాగునీటి రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా నిధుల కోత విధించింది. గత సంవత్సరం కంటే ఈ బడ్జెట్‌లో రూ.4,584 కోట్లు తగ్గించింది. రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు మేజర్, మీడియం, మైనర్ సాగునీటి ప్రాజెక్టులపై మొత్తంగా రూ.1.69 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులకు కేటాయించే నిధుల్లో భారీగా కోత విధించింది. గత సంవత్సరం బడ్జెట్‌లో రూ.26,885 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.22,301 కోట్లు మాత్రమే కేటాయించింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సైతం రూ.28,024 కోట్లు ప్రతిపాదించగా, ఇప్పుడు రూ.5,723 కోట్లు కోత వేయడం గమనార్హం. సాగునీటి రంగానికి సంబంధించిన కేటాయింపులు తీవ్ర నిరాశను మిగిల్చాయి. కేంద్రం ఏఐబీపీ తదితర పథకాల కింద అందిస్తున్న నిధులకు రాష్ట్ర వాటాగా రూ.100 కోట్లు కేటాయించింది. భారీ ప్రాజెక్టులపై కాకుండా, మీడియం ప్రాజెక్టులపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టిసారించినట్టు బడ్జెట్ కేటాయింపులను బట్టి అర్థమవుతున్నది.

ఆ మూడు జిల్లాలకే..

సాగునీటి రంగానికి సంబంధించిన బడ్జెట్ కేటాయింపుల్లో నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లోని ప్రాజెక్టులకే ప్రభుత్వం పెద్ద పీట వేసింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు-రంగారెడ్డి, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, ఆర్డీఎస్ లింక్ కెనాల్, సంగంబండ ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయించింది. నల్లగొండ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ, డిండి, మూసీ, ఎన్ఎస్‌పీ లిఫ్ట్ స్కీమ్‌లకు, ఖమ్మం జిల్లాలో సీతారామ, వైరా, ఎస్సారెస్పీ స్టేజ్- 2 ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించింది. ఇతర అనేక ప్రాధాన్యాలు కలిగిన ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో మొండి చెయ్యి చూపింది. దేవాదుల, వరదకాలువ, చిన్నకాళేశ్వరం, కుప్తితోపాటు పలు ప్రాజెక్టులకు మాత్రమే కొద్దిమేర నిధులు విదిల్చింది. కాళేశ్వరం, చనాకా-కొరాట, నీల్వాయి, మత్తడి, ర్యాలివాగు, జగన్నాథ్‌పూర్, కాళేశ్వరం, నిజాంసాగర్ ఆధునీకీకరణకు నిధుల కేటాయింపుల్లో భారీగా కోత విధించింది.

గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	నిధులు
కాళేశ్వరం	1,676.46
సీతారామ	687.81
ఎల్లంపల్లి	349.66
ఎస్సారెస్పీ వరదకాలువ	265.21
ప్రాణహిత-చేవెళ్ల	248.99
దేవాదుల	245.00
లోయర్‌పెన్‌గంగ	133.83
చిన్నకాళేశ్వరం	200.00

కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)

పాలమూరు-రంగారెడ్డి	1,285.00
కల్వకుర్తి	715.00
డిండి	300.00
నెట్టెంపాడు	105.00
ఎస్ఎల్‌బీసీ	800.00
కోయిల్‌సాగర్	429.86
నాగార్జునసాగర్ లిఫ్ట్	500.00
సంగంబండ	188.07

ప్రాజెక్టుల నిర్వహణకు నిల్

తెలంగాణ సాగునీటి రంగంలో చెరువులు అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణ, పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. మిషన్‌కాకతీయ పథకాన్ని చేపట్టి ఏటా బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మైనర్ ఇరిగేషన్‌కు కేటాయించే నిధులను సగానికంటే ఎక్కువగా తగ్గించింది. గత బడ్జెట్‌లో రూ.1,011.14 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.585.63 కోట్లు కేటాయించారు. అందులో మిషన్ కాకతీయకు రూ.273 కోట్లు మాత్రమే కేటాయించింది. మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ కోసం గత ప్రభుత్వం జీవో 45 ద్వారా ప్రతి బడ్జెట్‌లో రూ.250 కోట్లకుపైగా కేటాయిస్తూ రాగా, ప్రస్తుత బడ్జెట్‌లో భారీగా కోత విధించారు. కేవలం రూ.50 కోట్లు కేటాయించింది. చిన్నలిఫ్ట్ స్కీమ్‌ల నిర్వహణకు సంబంధించిన బడ్జెట్‌లో కూడా కోత విధించింది.

దళితబంధు ఔట్.. అభయహస్తం మాయం

- బడ్జెట్‌లో కేటాయింపులే లేని పథకాలు
- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ తిలోదకాలు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): దళితుల సర్వతోముఖాభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించి అమలుచేసిన దళితబంధు పథకానికి కాంగ్రెస్ సర్కార్ స్వస్తి పలికింది. అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12లక్షలు ఇస్తామన్న వాగ్దానాన్ని సైతం తుంగలో తొక్కింది. అటు దళితబంధు పథకానికి, ఇటు అంబేద్కర్ అభయహస్తం పథకానికి తాజా బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించలేదు. ఎస్సీ కార్పొరేషన్‌కు సైతం నిధుల కేటాయింపు బడ్జెట్ పద్దులో కానరాలేదు.

సొంత వ్యాపారాలు, తెలిసిన, నచ్చిన ఉపాధి మార్గాన్ని ఎంచుకొని జీవించడానికి నిరుపేద దళిత కుటుంబాలకు ఎలాంటి షరతులు లేకుండా, బ్యాంకు లింకేజీ లేకుండా ఏకమొత్తంగా రూ.10లక్షల నగదును అందించే సీఎం దళిత్ ఎంపవర్‌మెంట్ పేరిట దళితబంధు పథకాన్ని గత ప్రభుత్వం ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలివిడతలో రాష్ట్రవ్యాప్తంగా 44 వేల దళిత కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అందుకు రూ.4400 కోట్ల నిధులను వెచ్చించారు. ఆ పథకానికి 2023-24 బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. హుజురాబాద్ మినహాయించి నియోజకవర్గానికి 1500 మంది చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 118 నియోజకవర్గాల్లో మొత్తంగా 17,700 కుటుంబాలకు దళితబంధు పథకం ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేయాలని నిర్ణయించారు. అందుకు 17,700 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. జీహెచ్ఎంసీ పరిధిలోనేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల లబ్ధిదారులను ఎంపిక చేసి ఒక విడత ఆర్థిక సాయాన్ని కూడా అందజేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఆ పథకానికి నిధులేవీ కేటాయించకపోవడం గమనార్హం. దళిత్ ఎంపవర్‌మెంట్ స్కీమ్‌కు బడ్జెట్ పద్దులో రూ.2వేల కోట్లను కేటాయించినట్లు చూపినా అవి దళితబంధు పథకానికి కాదని ఎస్సీ సంక్షేమ ఉన్నతాధికారులు వెల్లడించడం గమనార్హం.

అభయహస్తం ఉత్తముచ్చటే..

అధికారంలోకి వస్తే దళితబంధు తరహాలో అంబేద్కర్ అభయహస్తం పేరిట ఒక్కో దళిత కుటుంబానికి రూ.12లక్షల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. రాబోయే ఐదేండ్లలో నిధులను కేటాయించి ఆ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపింది. చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభలో ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ప్రస్తుత బడ్జెట్‌లో ఆ పథకం ఊసే లేకుండా పోయింది. దీంతో ఉన్న దళితబంధుతో పాటు, అంబేద్కర్ అభయహస్తం పథకం కూడా ఉత్త ముచ్చటగానే మారింది.

దళితబంధుకు కేసీఆర్ నిధులివ్వలే

- బడ్జెట్‌లో రూ.17,700 కోట్లు కేటాయింపు
- అయినా రూపాయి కూడా విడుదల చేయలే
- ఇప్పుడు దళితుల గురించి మాట్లాడుతారా?
- డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): బడ్జెట్‌లో రూ. 17,700 కోట్లను దళితబంధు కోసం కేటాయించిన గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆరోపించారు. ఈ బడ్జెట్‌లో దళితబంధు ప్రస్తావన లేదన్న కేసీఆర్ మాటలు చూస్తుంటే నవ్వాలో? ఏడ్వాలో అర్థం కాకుండా ఉందని ఎద్దేవా చేశారు. శాసనసభలో బడ్జెట్ సమర్పించిన తర్వాత అసెంబ్లీ మీడియా హాల్-1లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను గత ప్రభుత్వం మాదిరిగా మళ్లించబోమని పేర్కొన్నారు. బ్యాక్‌లాగ్ నిధులను కూడా కలుపుకొని దళిత, గిరిజనులకు ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు పెడతామని తెలిపారు. సంక్షేమం,అభివృద్ధికి సమభాగంలో నిధులు వెచిస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మౌలిక వసతుల కల్పనకు ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించినట్టు వివరించారు. హైదరాబాద్‌లో ఉద్యోగ వ్యవస్థలకు, ఎకో సిస్టం అభివృద్ధికి కావాల్సిన నిధులను పెట్టుబడిగా పెడుతూ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని తెలిపారు. ఓ విజన్‌తో హైదరాబాద్‌లో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

దశ దిశ లేని బడ్జెట్

- అంతా ఆత్మస్తుతి, పరనింద
- రాష్ట్రానికి ఇది తిరోగమనమే
- మహాలక్ష్మికి మహా నిరాశ
- ఏకకాలంలో రుణమాఫీకి నిధులేవి?
- ఆరు గ్యారెంటీల్లేవ్.. అంకెల గారడే
- రాష్ట్ర బడ్జెట్‌పై హరీశ్‌రావు

గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, బండారు లక్ష్మారెడ్డి

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ పూర్తిగా ఆత్మస్తుతి, పరనిందగా ఉందని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వ మొదటి బడ్జెట్ దశ దిశ లేకుండా ఉందని, ఇది రాష్ట్రాన్ని తిరోగమన దిశలో నడిపే బడ్జెట్ అని అభివర్ణించారు. ఏడాదిలో 2 లక్షలు ఉద్యోగాల ప్రస్తావనే లేదని, ఆరుగ్యారంటీలను పూర్తిగా మరిచిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని నిందించారని, భట్టి 57 వేల కోట్లు అప్పు తెస్తామన్నారని.. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చినదానికంటే 17 వేల కోట్లు ఎక్కువ అని చెప్పారు. మహాలక్ష్మి పథకంపై బడ్జెట్ మహా నిరాశ కలిగించిందని, కోటి మంది మహిళలు నెలకు రూ. 2500 కోసం ఎదురుచూస్తున్నారని, ఎనిమిది నెలల్లో మహిళలకు రూ.20వేల కోట్లు ప్రభుత్వం బకాయి పడ్డదని చెప్పారు. ఆసరా పింఛను రూ. 4 వేలు ఇస్తామని బాండు పేపర్ మీద రాశారని, మరి బడ్జెట్లో ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. విద్యార్థులకు 5 లక్షల విద్యా భరోసా కార్డు, స్కూటీలు ఇస్తామన్నారని వాటి ప్రస్తావన ఏదని నిలదీశారు. కొత్త రేషన్ కార్డులు, రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ప్రస్తావన కూడా లేదని మండిపడ్డారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పి మొండిచేయి చూపారని, చేనేత కార్మికులకు గుండు సున్నా చూపారని ఆవేదన వ్యక్తంచేశారు.

తాగుబోతుల తెలంగాణ చేస్తరా ?

గత బడ్జెట్‌లో ఎక్సైజ్ ఆదాయం 18,470 కోట్లు ఉంటే, భట్టి ప్రతిపాదించింది 25,617 కోట్లు. 7,147 కోట్లు ఎక్కువ పెంచుతామంటే తాగుబోతుల తెలంగాణ చేస్తరా ? బెల్ట్ షాపులు బంద్ చేస్తామని చెప్పి, గల్లీకో బెల్ట్ షాప్ పెడతరా ?

- మాజీ మంత్రి హరీశ్‌రావు

విజన్‌లేని సర్కార్

ప్రభుత్వానికి ఏ రంగంలోనూ విజన్ లేదని హరీశ్ రావు విమర్శించారు. దేశంలో తలసరి ఆదాయంలో 13 స్థానంలో ఉన్న తెలంగాణను తాము నంబర్ 1 స్థానంలో తీసుకొచ్చామని చెప్పారు. తెలంగాణ తలసరి ఆదాయం 3,47,299 రూపాయలు అయితే, దేశ తలసరి ఆదాయం 1,83,236 మాత్రమేనని అన్నారు. రాష్ట్ర పౌరుడి తలసరి ఆదాయం దేశ తలసరి ఆదాయానికంటే రూ.1,64,063 ఎక్కువ అని, ఇది పదేండ్ల బీఆర్ఎస్ పరిపాలన ఫలితమని తెలిపారు. దేశం జీడీపీ కంటే 2 శాతం ఎక్కువ ఉందని, తెలంగాణ వృద్ధి రేటు 11.9 శాతం కాగా దేశవృద్ధి రేటు 9.1 శాతమేనన్నారు. బడ్జెట్లో ఏదో చెప్పినంత మాత్రాన నిజాలు నిజం కాకుండా పోతాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాడు గ్యారెంటీల గారడీ.. నేడు అంకెల గారడీ

భట్టి విక్రమార్క బడ్జెట్ అన్ని వర్గాలను తీవ్ర నిరాశపర్చింది. బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలు నీరు కారిపోయాయి. సంక్షేమం సన్నగిల్లింది.. అభివృద్ధి అగమ్యగోచరమైంది. ఎన్నికలప్పుడు గ్యారెంటీల గారడీ, ఇప్పుడేమో అంకెల గారడీ.

- మాజీ మంత్రి హరీశ్‌రావు

రుణమాఫీకి 15వేల కోట్లే

పంద్రాగస్టు కల్లా ఏకకాలంలో రైతు రుణమాఫీ అని దేవుళ్ల మీద ఒట్టు పెట్టారని, రూ.31వేల కోట్లు మాఫీ అని చెప్పి బడ్జెట్లో రూ.15,470 కోట్లు మాత్రమే కేటాయించారని హరీశ్‌రావు విమర్శించారు. మైనారిటీలకు 4వేల కోట్లని మ్యానిఫెస్టోలో చెప్పి రూ. 3 వేల కోట్లే కేటాయించారని, ప్రతి సంవత్సరం బీసీలకు 20 వేల కోట్ల ఇస్తామని చెప్పి 9 వేల కోట్లు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. ఇరిగేషన్‌కు రూ.22,301 కోట్లే కేటాయించారని చెప్పారు. దళితబంధు 10 లక్షల నుంచి 12 లక్షలకు పెంచుతామని ప్రస్తావన లేకుండా చేశారని విమర్శించారు. స్టాంపు డ్యూటీ ఆదాయాన్ని 18,228 కోట్లు ప్రతిపాదించారని, గతం కంటే 4 వేల కోట్లు ఎక్కువ వస్తాయని ప్రతిపాదించారని, భూముల విలువ, రిజిస్ట్రేషన్, పన్నుల భారం పెంచుతామని చెప్పకనే చెప్పారని మండిపడ్డారు.

రాజీనామాకు సిద్ధమా...?

ఒక్క డాక్టర్ పోస్టును భర్తీ చేయలేదని భట్టి ఆరోపించారు. మా హయంలో వైద్య ఆరోగ్య శాఖలో 30 వేల పోస్టులను భర్తీ చేశాం. భర్తీ చేసినట్టుగా నేను నిరూపిస్తా. నిరూపించకుంటే భట్టి రాజీనామాకు సిద్ధమా?

- మాజీ మంత్రి హరీశ్‌రావు

గ్రాంట్ ఇన్ ఎయిడ్ సాధ్యమా..?

గ్రాంట్ ఇన్ ఎయిడ్ విషయానికి వస్తే రూ.9729 కోట్లు గత సంవత్సరం వస్తే, నిన్ననే కేంద్రం నిధులు ఇవ్వలేదని తీర్మానం చేశారు. బడ్జెట్‌లో 21,636 కోట్లు పెట్టారని.. ఇంత ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గొర్రెల పంపిణీకి గుండు సున్నా

- విజయ మెగా డెయిరీకీ రూపాయి లేదు
- చేపల పంపిణీకి అంతంతే నిధులు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): గొర్రెల పంపిణీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. ఇప్పటికే లబ్ధిదారులు చెల్లించిన డీడీలను తిరిగి ఇచ్చేస్తుండగా, బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపేసినట్టేననే అనుమానాలు మరింత బలపడుతున్నాయి. పాల ఉత్పత్తికి అనుగుణంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మెగా డెయిరీని నిర్మించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ డెయిరీ మెయింటనెన్స్‌కు నిధులు కేటాయించకపోవడం విమర్శలకు దారితీస్తున్నది. మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీపై కాంగ్రెస్ ప్రభుత్వం శీతకన్ను వేసింది. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీకి రూ.100 కోట్లు అవసరం కానుండగా రూ.20 కోట్లే కేటాయించింది. మత్స్యకారుల ఇన్సూరెన్స్‌కు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. వెటర్నరీ కాలేజీల్లో మౌలిక సదుపాయాల కల్పనలోనూ వివక్ష చూపించింది. సిద్దిపేట కాలేజీకి నయా పైసా కేటాయించని ప్రభుత్వం.. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్ వెటర్నరీ కాలేజీకి రూ. 6.50 కోట్లు కేటాయించింది. పెబ్బేరులోని ఫిషరీస్ కాలేజీకి పైసా కేటాయించలేదు.

మద్యం ప్రియులే ఆదుకోవాలి!

- రూ.25,617 కోట్లకు మద్యం అమ్మకాల పెంపు
- ఎక్సైజ్ నుంచి రూ.5,318 కోట్లు 'అదనపు' లక్ష్యం
- మరింత తాగించడం.. లేదా ధరలు పెంచడం?
- 25 శాతం మేర పెరగనున్న మద్యం వినియోగం
- ఇప్పటికే ధరలు పెంచేందుకు సర్కారు యత్నం

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం ఆదాయాన్ని అదనంగా మరో రూ.5,318 కోట్లకు పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పథకాల అమలుకు ప్రభుత్వం తప్పనిసరిగా మందుప్రియులపైనే ఆధారపడాల్సిన దుస్థితి వచ్చింది. గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాబడి విభాగాల్లో ఎక్సైజ్‌శాఖలోని ఒక్క మద్యం విభాగం నుంచే రూ.25,617 కోట్ల నిధులను ఆశిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. గత ప్రభుత్వం కంటే ఎక్సైజ్ నుంచి రూ.5,318 కోట్లు 'అదనపు ఆదాయం' రావడమే లక్ష్యంగా పెట్టుకున్నది.

25% పెరగనున్న మద్యం వినియోగం

ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే కనీసం 25 శాతం అదనంగా మద్యం అమ్మకాలు చేపట్టాల్సి ఉన్నది. దీంతో మరింత తాగించడం లేదా ధరలు పెంచటం ఒక్కడే మార్గంగా కనిపిస్తున్నది. ఇప్పటికే ఒకవైపు మద్యం ధరలు పెంచేందుకు సర్కారు ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తున్నది. అదనపు ఆదాయం సమకూర్చుకునే క్రమంలోనే నాణ్యత తక్కువ, కల్తీ మద్యం ఆరోపణలున్న కొన్ని కంపెనీలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీనిపై బీఆర్ఎస్ పోరాటం చేయటంతో అనుమతులు తాత్కాలికంగా నిలిపివేసింది. దీంతో మరో ప్రణాళికలో భాగంగా 20 - 25 శాతం మద్యం అమ్మకాలు పెంచేలా, ప్రభుత్వ లక్ష్యానికి తగ్గట్టుగా సిబ్బందికి టార్గెట్లు సైతం ఇచ్చినట్టు తెలిసింది.



సంక్షేమ పథకాల కోసం ధరల పెంపు?

సర్కారుకు వస్తున్న ఆదాయ వనరుల్లో మద్యం అమ్మకాలే ప్రధానం. మద్యం అమ్మకాలు, ట్యాక్స్‌ల ద్వారా ఏటా సుమారు రూ.35 వేల కోట్ల వరకు సర్కారుకు ఆదాయం సమకూరుతుంది. అయితే ఈ లక్ష్యాన్ని రూ.45 వేల కోట్లకు పెంచారు. ఎక్సైజ్‌శాఖ ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పడిన మంత్రి వర్గం ఉపసంఘం నిధులు ఎలా పెంచాలనే సుదీర్ఘంగా చర్చించింది. ఒక్కో మద్యం షాపునకు రూ.50 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించినట్టు కూడా సమాచారం. దీంతో మద్యం అమ్మకాలు పెంచటం అనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. మద్యం, ఇతర వ్యాట్‌లు కలుపుకొని 2022లో రూ.32 వేల కోట్లు, 2023లో రూ.35 వేల కోట్లు ఆదాయం వచ్చింది. ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని అదనంగా రూ.10 వేల కోట్లకు పెంచి.. రూ.45 వేల కోట్లు రాబట్టాలని చూస్తున్నది. ఈ క్రమంలో 25 శాతం మద్యం ధరలు పెంచాలని కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. త్వరలోనే ధరలు పెరిగే అవకాశం ఉన్నదని ఎక్సైజ్ వర్గాలు తెలిపాయి.

నాడు బీఆర్ఎస్‌ను బద్నాం చేసిన కాంగ్రెస్!

నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఓ క్రమ పద్ధతిలో మద్యం అమ్మకాలు చేపట్టినా.. బెల్ట్‌షాపులపై, మద్యం అమ్మకాలపై కాంగ్రెస్, నాటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి గగ్గోలు పెట్టారు. అలాంటిది ఈ ఏడాది మద్యం అమ్మకాల ద్వారా ఎన్నడూ లేనివిధంగా రూ.45 వేల కోట్ల మేరకు ఆదాయం పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నది. నాడు బీఆర్ఎస్‌ను విమర్శించిన వారు.. ఇప్పుడు చేస్తున్నది ఏమిటి? అని ప్రభుత్వాన్ని విశ్లేషకులు నిలదీస్తున్నారు.

రోడ్లకు భారీగా తగ్గిన కేటాయింపులు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రోడ్లకు కేటాయించే బడ్జెట్‌లో ఈసారి భారీగా కోతపడింది. గత ఏడాది రూ. 8,833 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.5,790 కోట్లే కేటాయించారు. మేజర్ జిల్లా రోడ్లకు రూ. 298.86 కోట్లు, కోర్ నెట్‌వర్క్ రోడ్లకు రూ.100 కోట్లు, రోడ్ సేఫ్టీకి రూ.2.62 కోట్లు, రేడియల్ రోడ్లకు రూ. 57 కోట్లు, ఇతర రోడ్లకు రూ.10 కోట్లు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాల రోడ్లకు రూ. 50 కోట్లు, గ్రామీణ రోడ్లకు రూ.90 కోట్లు, లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రిమిజమ్ పనులకు రూ.4 కోట్లు, రైల్వే సేఫ్టీ వర్క్స్ కింద ఆర్‌వోబీలకు రూ.120 కోట్లు, ఆర్వోబీలు, ఆర్‌యూబీలకు రూ.8.45 కోట్లు, ఇతర రోడ్లు, బ్రిడ్జిలకు కలిపి రూ. 3031.47 కోట్లు కేటాయించారు. ఇక, ట్రిపుల్ ఆర్‌కు రూ.1,525 కోట్లు కేటాయించారు.

పల్లెప్రగతిపై నీలినీడలు

- పంచాయతీరాజ్ శాఖకు తగ్గిన కేటాయింపులు
- పెంఛన్ల పెంపు, మహిళా పథకం హామీ అటకెక్కినట్టేనా?

పంచాయతీరాజ్ శాఖకు కేటాయింపులు

ఆర్థిక సంవత్సరం	నిధులు(కోట్లల్లో)
2022-23	రూ.21,887
2023-24	రూ.30,976
2024-25	రూ.29,816

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): పెరిగిన జనాభాకు అనుగుణంగా పంచాయతీరాజ్ శాఖకు బడ్జెట్ కేటాయింపులను పెంచాల్సింది పోయి కాంగ్రెస్ సర్కారు ఈ ఏడాది బడ్జెట్‌లో తగ్గించి చిన్నచూపు ప్రదర్శించింది. నిరుడు బీఆర్ఎస్ ప్రభుత్వ కేటాయింపుల కంటే రూ.1,600 కోట్లు తక్కువగా ప్రతిపాదించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ శాఖ పట్ల వివక్షను చాటుకున్నది. ఆసరా పింఛన్ సొమ్మును రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంపు, మహిళలకు నెలనెలా 2,500 ఆర్థికసాయం హామీలకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయపోవడంతో ఆ హామీలపై ఉస్సూరుమనిపించారనిపిస్తున్నది. దాదాపు 10 లక్షల మందికి కొత్త పింఛన్లకూ ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులు చేయలేదు. వడ్డీలేని రుణాలకు రూ.1,302 కోట్లు కేటాయించగా, మహిళలకు రూ.20 వేల కోట్ల రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అటు.. బడ్జెట్‌లో మున్సిపల్ శాఖకు స్వల్పంగానే కేటాయింపులను పెంచారు. 2022-23లో రూ.8,029 కోట్లు, 2023-24లో రూ.11,372 కోట్లు కేటాయించగా, 2024-25లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15,594 కోట్లే కేటాయించింది.